క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సంతపేట సెక్షన్ పరిధిలో ఆదివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో నిలుపుదల చేస్తున్నట్లు డీఈ శేషాద్రి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డీబీరోడ్డు, హైరోడ్డు, జెండామానువీధి, బజారువీధి, గాంధీ రోడ్డు, తోటపాళ్యం, తంగవేలుకాలనీ, సంతపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రతి చిన్నారికీ టీకాలు


చిన్నారులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

యాదమరి: మండలంలో ఉన్న ప్రతి చిన్నారికీ వ్యాధి నిరోధక టీకా వేయాలని యాదమరి ప్రభుత్వాస్పత్రి వైద్యులు అన్నారు. శనివారం మండలంలోని గుట్టకింద దళితవాడ గ్రామంలో పలువురు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వ్యాధి నిరోధక టీకా వేయడం ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చని అన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజనపై ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, హౌసింగ్ సిబ్బంది

పూతలపట్టు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలు చేసి 8 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని బైటపల్లె, పక్కాలగుట్టలో హౌసింగ్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ.. సమాజంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు గృహాలను అందించాలన్నదే భారత ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సింగిల్ విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, సర్పంచ్ రామ తులసి, బాలాజీ పాల్గొన్నారు.

రాయితీపై జొన్నలు, మొక్కజొన్నలు

గుడిపాల: పాడి రైతులకు అందుబాటులో జొన్నలు, మొక్కజొన్నలు అందుబాటులో ఉన్నాయని పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. మండలానికి మొక్కజొన్నలు 7,830 కేజీలు, జొన్నలు 3,240 కేజీలు వచ్చాయన్నారు. మొక్కజొన్నలు కేజీ ధర రూ.68లని, అయితే ప్రభుత్వం సబ్సిడీపై రూ.17కి ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే జొన్నలు కేజీ ధర రూ.71.50 ఉండగా, సబ్సిడీపై రూ.17.88 పైసలకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆర్బీకేల్లో ఇవి ఉన్నాయన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రూరల్ పోలీసులు శనివారం యాదమరిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మాదిరెడ్డిపల్లె-బొమ్మ చేను కూడలి వద్ద కర్ణాటక మద్యం కలిగివున్న శీనుమండడి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 17 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. దాడుల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో వసతులు ప్లీజ్!

చిత్తూరు అర్బన్: వచ్చేవారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని.. చిత్తూరులోని మసీదుల్లో వసతులు కల్పించాలని శనివారం ముస్లిం మైనారిటీ నాయకులు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అరుణకు వినతిపత్రం అందజేశారు. మసీదుల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మైనారిటీ నాయకులు కరీముల్లా, కార్పొరేటర్ సయ్యద్, కో-ఆప్షన్ సభ్యులు అను, షకీల్, రషీద్ ఉన్నారు.

ఐఆర్‌డీఏ మీటర్లు ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో సీటీ మీటర్ల స్థానంలో ఐఆర్‌డీఏ(స్కానింగ్) మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. చిత్తూరులోని మిట్టూరులో 34, సంతపేటలో 46, గిరింపేటలో 35, కొంగారెడ్డిపల్లెలో 8, రూరల్-2లోని పాలసముద్రంలో 8, పెనుమూరులో 12, రూరల్-3లోని చిత్తూరు రూరల్స్‌లో 40, రెడ్డిగుంటలో 14, కొత్తపల్లెలో 40..ఇలా మొత్తం 309 మీటర్లు మార్చాల్సి ఉందన్నారు. 20 కిలోవాట్ల లోడ్ కంటే అధికంగా ఉన్న ప్రభుత్వ, వాణిజ్య, పరిశ్రమలకు ఈ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రమాదం కాదు... నిప్పు పెట్టాడు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఎస్టేట్ ప్రాంతంలో 3రోజుల క్రితం టైర్ల గోదాములో జరిగింది అగ్నిప్రమాదం కాదని, నిప్పు పెట్టినట్లు తేలింది. నగరానికి చెందిన ముత్తు కార్లు, లారీలకు చెందిన పాత టైర్లను కొనుగోలు చేసి ఎస్టేట్‌లోని ఓ గోదాములో నిల్వ ఉంచేవాడు. వీటన్నింటిని కట్‌చేసి రబ్బరును మరో ఫ్యాక్టరీకి విక్రయించేవాడు. ఈ క్రమంలో సాంబయ్యకండ్రిగకు చెందిన వ్యక్తితో ముత్తుకు కుటుంబ తగాదాలున్నాయి. దీంతో ఆగ్రహించిన వ్యక్తి టైర్ల గోదాముకు నిప్పంటించాడు. అగ్నిమాపక అధికారులు శ్రమించి మంటల్ని ఆర్పారు. అదృష్టశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ మరుసటిరోజు ఇక్కడున్న ఓ దుకాణంలో సీసీ ఫుటేజీ పరిశీలించగా ఓ యువకుడు వ్యక్తి టైర్ల గోదామును ఉద్దేశపూర్వకంగా తగులబెట్టినట్లు తేలింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఇంటికీ నవరత్నాల ఫలాలు

- జగనన్నకు ప్రజల అండ
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

తవణంపల్లె: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ నవరత్నాల ఫలాలు అందుతుండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల అండ మెండుగా ఉందని, మరోసారి పార్టీకి ప్రజలు పట్టం కట్టడం తథ్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని మారేడుపల్లె, పుణ్యసముద్రం పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజలకు ఆయన చెప్పారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, పింఛన్లు, ఇంటి పట్టాలు, పక్కాగృహాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం దిగువ మారేడుపల్లెలో ఎమ్మెల్యే, అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆదేశించారు. జీజీఎంపీ నిధులతో ఏఏ పనులు చేయాలో అధికారులకు నిర్దేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఏఓ ప్రవీణ్, ఏపీఓ లలిత, ఏపీఎం రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్, పీఆర్ఏఈ గురవారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ కిరణ్‌కుమార్, ఎంపీటీసీ డేవిడ్, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు కిషోర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, మాధవనాయుడు తదితరులతోపాటు వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వందశాతం బిల్లులు వసూలు చేయాలి


మాట్లాడుతున్న ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ పరిధిలో వంద శాతం ప్రైవేటు బిల్లులు వసూలు చేయాలని ఈఈ హరి ఆదేశించారు. శనివారం రూరల్ ఈఈ కార్యాలయంలో డీఈ, ఏఏఓ, ఏఈలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని 7 సెక్షన్లలో మొత్తం రూ.3.40 కోట్లు ప్రైవేటు కలెక్షన్స్ వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 75 శాతం వసూలు చేశారని, మిగిలిన బకాయిలు వారంలోపు వసూలు చేసేదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సకాలంలో ట్రీ కటింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ కొండయ్య, ఏఏఓ గీత, ఏఈలు గుర్రప్ప, తనిగవేలు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ లబ్ధి


గుడిపాల: జగనన్న సురక్షపై ఇంటింటా సర్వేలో స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి

గుడిపాల: జగనన్న సురక్ష పథకం ద్వారా అందరికీ లబ్ధి కలుగుతుందని స్పెషలాఫీసర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం వసంతాపురంలో ఇంటింటా వలంటీర్లు, గృహసారథులతో ఆయన పర్యటించారు. జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వలంటీర్, సచివాలయ సిబ్బంది వెళ్లి వారికి ఎలాంటి ధ్రువపత్రాలు కావాలో తెలుసుకొని వాటిని వలంటీర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సర్టిఫికెట్లకు కావలసిన ధ్రువపత్రాలను లబ్ధిదారుల వద్ద తీసుకొని వారికి టోకెన్‌ను అందజేయాలన్నారు. సర్టిఫికెట్లన్నీ ప్రభుత్వం క్యాంపు ద్వారా ఉచితంగా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాగి పంట సాగుపై మొగ్గు చూపాలి


రాగి పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్

తవణంపల్లె: రైతులు రాగి పంట సాగుపై మొగ్గు చూపాలని తవణంపల్లె వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ కోరారు. శనివారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో రాగి పంట సాగు పెంపు విషయమై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 300 హెక్టార్లలో రాగి పంట సాగు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. మామిడిలో అంతర పంటగా రాగిని సాగు చేసుకోవచ్చన్నారు. రాగి పంటను సాగు చేసిన రైతుల నుంచి ప్రభుత్వమే కిలో రూ.38లకు కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

యాదమరి: మండలంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. యాదమరి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు వాసు, జ్యోతి, భువనేశ్వరిని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్, రాష్ట్ర కార్యదర్శి పురుషోత్తం, జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు దేవరాజుల రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు గుణశేఖర్, ఓబుల్ రెడ్డి, మదనమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కుంభాభిషేక పూజలు


పూజలో ధర్మకర్త బుల్లెట్ సురేష్, భక్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు చర్చివీధిలోని శ్రీ కృష్ణ విలాస సభ కుంభాభిషేక పూజలు శనివారం కూడా వైభవంగా కొనసాగాయి. జలాధివాసం, తిరుమంజనం, హోమ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త బుల్లెట్ సురేష్, సభ్యులు అప్పు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో గొయ్యిలు ఉండరాదు


పాఠశాలలో సంపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

యాదమరి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాదకరంగా ఉన్న గొయ్యిలు ఉండరాదని ఎంపీడీఓ శివరాజ్ ఆదేశించారు. రెండు రోజుల క్రితం తెల్లరాళ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్ కోసం తీసిన గొయ్యిలో వర్షపునీరు రావడంతో ఆ నీటిలో ఇద్దరు పిల్లలు మృతి చెందిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో ప్రమాదకర గొయ్యిలు, రాళ్లు వెంటనే తొలగించాలన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న గొయ్యిలను పూడ్చివేశారు. అలాగే తెల్లరాళ్లపల్లె పాఠశాలకు ప్రహరీ గోడ కొంతమేర లేకపోవడంతో గోడను నిర్మించారు.

గుంతలను పూడ్చండి

పూతలపట్టు: నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాలలో నిర్మాణాల కోసం తీసిన గుంతలను పూడ్చాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పి.కొత్తకోట, అయ్యప్పగారిపల్లి, గొడుగుచింత ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. నీటి సంపులపై తప్పకుండా మూత ఉంచాలని ఆదేశించారు. అయ్యప్పగారిపల్లె ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తక్కువగా వండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజన విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి


ఐరాల పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: కుష్టువ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఐరాల వైద్యాధికారి పూర్ణలత తెలిపారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో కుష్టువ్యాధి నిర్మూలనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని పీహెచ్‌సీకి తీసుకొచ్చి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. సీహెచ్ఓ సుగుణావతి, పీహెచ్ఎన్ జీవకళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు చిత్తూరులో న్యాయశాఖ ఉద్యోగ సంఘ ఎన్నికలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘ ఎన్నికలు ఆదివారం చిత్తూరులో నిర్వహించనున్నారు. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ పూర్తయ్యింది. అధ్యక్ష పదవికి చిత్తూరుకు చెందిన గోపినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ పోటీలో ఉన్నారు. చిత్తూరు, తిరుపతి, మదనపల్లె డివిజన్లకు సంబంధించి 531 మంది ఉద్యోగులు ఓటుహక్కు కలిగి ఉన్నారని ఎన్నికల అధికారులు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, తారకేశ తెలిపారు. చిత్తూరులోని పాత కోర్టు ఆవరణలో ఉన్న న్యాయవాదుల సంఘ కార్యాలయం (బార్)లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఫలితాలను ప్రకటిస్తామన్నారు. మొత్తం 11 పోస్టులకు 22 మంది ఉద్యోగులు పోటీ పడుతున్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికుల ఆందోళన

చిత్తూరు అర్బన్: మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించే విషయమై ప్రభుత్వం న్యాయం చేయాలని రాష్ట్ర మునిసిపల్ ఇంజినీరింగ్ వర్క్స్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులతోపాటు ఏళ్ల తరబడి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తమను కూడా క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం కమిషనర్ అరుణను కలిసి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శరవణ, వెంకటేష్, రవి, పిరుల్లా, దుర్గాప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

చిత్తూరు రూరల్: కేసులతో పేరుతో ఇబ్బందికి గురిచేసిన తమిళనాడు క్రిష్ణగిరికి చెందిన పలువురు బాధిత మహిళలకు న్యాయం చేయాలని వీసీకే (విముక్తి చిరుతల కచ్చి) రాష్ట్ర అధికార ప్రతినిధి గణపతి డిమాండ్‌చేశారు. చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో శనివారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమిళనాడు క్రిష్ణగిరికి చెందిన మహిళపై జరిగిన వేధింపులపై సోమవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించ తలపెట్టామని, ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు దొరస్వామి, వినోద్‌కుమార్, అనిల్, కుమార్, రవి తదిరతులు పాల్గొన్నారు.

ఏపీఎంగా సుధారాణి



గుడిపాల: ఇందిరాక్రాంతి ఏపీఎంగా సుధారాణి నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఈశ్వరి చిత్తూరు డీఆర్‌డీఏకు బదిలీ అయ్యారు. యాదమరి మండలం నుంచి సుధారాణి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచాలి

ఐరాల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-2 దామోదర నాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీలో ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తరగతి గదిలో విద్యార్థుల స్థాయిని గుర్తించి వారికి తగిన విధంగా పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని సూచించారు.

డీఈఓను కలిసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలని శనివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు డీఈఓ విజయేంద్రరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఆ సంఘం జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల వద్ద వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. టెక్నో, ఒలంపియాడ్, ఐఐటీ తదితర శిక్షణల పేరుతో దోచుకుంటున్నారని చెప్పారు.

వినాయకుని దర్శనానికి 5 గంటలు


భక్తులతో నిండిపోయిన క్యూలు


చక్రపాణిరెడ్డికి స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. శనివారం సెలవు దినం కావడంతో స్వామివారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100 క్యూలైన్లు నిండిఎయి ఆరుబయట వరకు భక్తులు బారులు తీరారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, అధికారులు చర్యలు తీసుకున్నారు.

గణనాథుని సేవలో శ్రీశైలం ఆలయ చైర్మన్

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శ్రీశైలం ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కూడళ్లలో సుందరీకరణ పనులు


సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని కూడళ్లలో సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె. అరుణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కొంగారెడ్డిపల్లె కెల్విన్ స్కేల్ సర్కిల్ వద్ద చేస్తున్న కూడలి సుందరీకరణ పనులను శనివారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. మొక్కలను నాటి ఆమె మాట్లాడారు. నగరంలోని ప్రధాన కూడళ్లతోపాటు దుర్గా నగర్ కాలనీ పరిధిలో దుర్గమ్మ గుడి, తిమ్మారెడ్డి, వివేకానంద, మురకంబట్టు, కట్టమంచి, దర్గ కూడళ్లను సుందరీకరించే పనులు వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పచ్చదనం పెంపు చర్యల్లో భాగంగా నిర్దేశించిన ప్రాంతాల్లో మొక్కలు నాటడాన్ని విస్తృతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ వెంకట ప్రసాద్, ఏఈ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల పరిశీలన

చిత్తూరు అర్బన్ : నగరంలోని ప్రధాన కూడళ్ల సుందరీకరణ పనుల్లో భాగంగా గాంధీ విగ్రహ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల పనితీరును నగర కమిషనర్ అరుణ శనివారం రాత్రి పరిశీలించారు. గాంధీ విగ్రహ కూడలి, రైల్వే వంతెన ప్రారంభం వద్ద ఏర్పాటు చేసిన మూడు హైమాస్ట్ లైట్ల పనితీరును పరిశీలించారు. ఇదే సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు చేస్తున్న ఏర్పాట్లను పోలీసులతో చర్చించారు. పూలే విగ్రహం వద్ద లైటింగ్ సామర్థ్యం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ వెంకట ప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన


సంతపేట ఇందిరానగర్‌లో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని వేము ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థులు కోరారు. ఆ కళాశాల విద్యార్థులు శనివారం జిల్లా కేంద్రంలోని పాఠశాలలు, పలు కాలనీల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ఆన్ హెల్త్ అండ్ హైజిన్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. పరిశుభ్రంగా ఎలా ఉండాలి, ఎలాంటి ఆహారము తీసుకోవాలి? అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఓడీ లీలాలక్ష్మి, గైడ్ మనికంఠ పర్యవేక్షణలో పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు శ్రీ హిమవాణి, మోనిష, జ్యోత్స్న, తనూజ తదితరులు పాల్గొన్నారు.

పాల ఏకరుల సంక్షేమానికి కృషి


కుమార్‌రాజాను అభినందిస్తున్న డైరెక్టర్లు

బంగారుపాళెం: వెనుకబడిన పాలఏకరుల సంక్షేమానికి పాటుపడతానని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. చైర్మన్‌గా నియమితులైన కుమార్‌రాజాను శనివారం ఆయన నివాస గృహంలో పాలఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు, వివిధ జిల్లాలకు చెందిన పాలఏకరి సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, ఓసీ జాబితాలో ఉన్న పాలఏకరి కులాన్ని వెనుకబడిన బీసీ జాబితాలోకి తీసుకొచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని చెప్పారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పాలఏకరుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 56 వెనుకబడిన కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి బీసీల సంక్షేమానికి, అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. పాలఏకరులు జగనన్నకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు రఘుపతి(చంద్రగిరి), కిరణ్మయి(మదనపల్లె), రమణ(పుంగనూరు), సభాపతి(పులివెందుల), పరంధామ(సింగనమల), రెడ్డెప్ప(తిరుపతి), చలపతి(ధర్మవరం), శ్రీలక్ష్మి(రాయచోటి), కుళ్లాయమ్మ(పుట్టపర్తి), అరుణకుమారి(రాజంపేట), నిర్మల(పులివెందుల), పాల ఏకరి జిల్లా నాయకులు మురళి, రాజకుమార్, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, సుబ్బయ్య, మల్లికార్జున, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నివాసం ఉన్నచోటే ఓటరుగా ఉండాలి


డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : నివాసం ఎక్కడుంటే అక్కడే ఓటరుగా ఉండాలని డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో ఓటరు జాబితా సవరణపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం 91.87 పూర్తి చేసినట్లు వెల్లడించారు. నకిలీ ఓటర్లను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రత్యేక సమ్మరీ రివిజన్ కసరత్తు

జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక సమ్మరీ రివిజన్ కసరత్తు చేస్తున్నట్టు డీఆర్వో వెల్లడించారు. జూలై 20 వరకు దరఖాస్తుల కసరత్తుపై ఈఆర్వో, ఏఈఆర్వో, ఈఆర్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన చేస్తారన్నారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ పునర్వ్యవస్థీకరణల ప్రక్రియ ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు ఫార్మట్ 1 నుండి 8 వరకు సప్లిమెంట్ల తయారీ, ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్, 1.1.2024 నాటికి నాణ్యత కలిగిన ఓటర్ల జాబితా విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పలు పార్టీల నాయకులు ఉదయ్ కుమార్, కోదండయాదవ్, నాగరాజన్, గంగరాజు, పరదేశి, ఎన్నికల విభాగం సిబ్బంది ఉమాపతి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మసముద్రంలో 'ఫ్యామిలీ డాక్టర్'


చామంతిపురంలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహిస్తున్న డాక్టర్ రష్మిత


పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రియాంక

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల ముంగిటే వైద్య సేవలు అందిస్తున్నట్టు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. శనివారం చామంతిపురం లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. సిబ్బంది శ్రీలత, యమున, దేవప్రీత, ప్రవీణ్ పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

తవణంపల్లె: రక్తహీనత రాకుండా గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శనివారం మండలంలోని పుణ్యసముద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 67 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ద్వారాకాపురంలో మంచానికే పరిమితమైన రోగులను పరీక్షించారు.